ప్రజాశక్తి

శనివారం 04 అక్టోబర్ 2025 | 5 | కర్నూలు



రక్తమోడిన దేవరగట్టు

- బన్ని ఉత్సవంలో ఇద్దరు మృతి
- నాట్యమాడిన కర్రలు
- గట్టుపై భక్తులదే పట్టు
- ఫలించని పోలీసుల వ్యూహం



కర్రలతో బన్నీ ఉత్సవంలో పాల్గొన్న ఆయా గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి - హొళగుంద

జిల్లా హొళగుంద మండల పరిధిలోని నెరణికి, నెరణికి తండా, కొత్తపేట కొండ గుహలో వెలసిన దేవరగట్టు శ్రీ మాళ మల్లేశ్వర జైత్రయాత్ర (కర్రల సమరం) గురువారం అర్ధరాత్రి జరిగింది. నిఘానేత్రాలు ఉన్నప్పటికీ కర్రలు నాట్యం ఆడాయి. పోలీసుల వ్యూహాలు ఫలించలేదు. జైత్ర యాత్రలో తల పగిలి ఒకరు, తొక్కిసలాటలో మరొకరు మృతి చెందారు. ఆలూరు మండలం ఆరికెర చిన్న తిమ్మప్ప (57) సింహాసన కట్ట వద్ద కర్రలతో కొట్టుకోవడంలో తల పగిలి మృతి చెందారు. ఆదోని అరుణ్‌జ్యోతి నగర్ చిన్న ఆంజనేయులు (50) తొక్కిసలాటలో ఊపిరాడక మృతి చెందారు. 80 మందికి గాయాలయ్యాయి. పది మంది పరిస్థితి విషమం ఉంది. క్షతగాత్రులను ఆలూరు, ఆదోని ఆస్పత్రికి తరలించారు. నలుగురిని మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. 800 మంది పోలీసులు ఉన్నప్పటికీ రింగ్ కర్రలను దేవరగట్టుకు రాకుండా ఆపలేకపోయారు. అవగాహన సదస్సులు, రింగ్ కర్రలు స్వాధీనం చేసుకున్నప్పటికీ రక్తపాతం ఆగలేదు. పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు తప్ప నివారించడంలో విఫలమయ్యారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



సిసి కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

జైత్రయాత్ర సాగిందిలా..

శ్రీమాళ మల్లేశ్వర జైత్రయాత్రను కొనసాగించుటకు నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులు గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో పాలబండకు చేరుకొని ఉత్సవాలను ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో కలిసికట్టుగా అన్నదమ్ములవలె ఉండాలని పాత కక్షలు పెట్టుకోకూడదని పాల బాస (తీర్మానం) తీసుకున్నారు. అనంతరం మూడు అవుట్లు వదిలి డుర్ర గో పరాక్ మాల మల్లేశ్వర బహుపరాక్ అంటూ నినాదాలు చేసి ఏకతాటిపై అందరూ ఒక్కసారిగా మాల మల్లేశ్వర సన్నిధికి చేరుకున్నారు. కొండపైకి వెళ్లి, ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీ మాల మల్లేశ్వరలకు వివాహం జరిపించారు. అనంతరం జైత్ర యాత్రలో భాగంగా శ్రీ మాల మల్లేశ్వరల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న సమయంలో విగ్రహ మూర్తులను దక్కించుకోవాలని ఒకరిని ఒకరు కొట్టుకున్నారు. కర్రలు నాట్యమాడాయి. దీంతో రక్తపాతం చెలరేగింది. గురవయ్య తన తొడ పిక్కల నుండి రక్తాన్ని చిందించి అక్కడ నుండి జైత్రయాత్ర యాత్ర బసవన్న గుడి దగ్గరకు చేరుకొని భవిష్యవాణి వినించారు. మాళమల్లేశ్వర విగ్రహ మూర్తులు సింహాసన కట్టకు చేరడంతో ఉత్సవం ముగిసింది. దీంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఎస్పి విక్రాంత్ పాటిల్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యా భరద్వాజ్ పర్యవేక్షించారు.

ఏరులై పారిన కర్ణాటక మద్యం, నాటుసారా

దేవరగట్టులో గురువారం జరిగిన కర్రల సమరంలో కర్ణాటక మద్యం ప్యాకెట్లు, నాటుసారా ఏరులై పారాయి. అంత మంది పోలీసులు ఉన్నా కర్ణాటక మద్యం దేవరగట్టులో ప్రత్యక్షమవడం ఆశ్చర్యానికి గురి చేసింది. గత రెండు నెలలుగా ఎక్సైజ్ పోలీస్ అధికారులు దేవరగట్టు పరిసర ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా కాస్తున్న నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి వందల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినా దేవరగట్టులో నాటుసారా ఏ రహదారుల చూసిన కనపడడం వెనుక పోలీసుల పాత్ర ఉండే ఉంటుందని చర్చించుకున్నారు. శ్రీమాళ మల్లేశ్వర జైత్రయాత్రలో భక్తులు మద్యం సేవించి మైకంలో పాల్గొనడం ఇష్టానుసారంగా ఒకరినొకరు కొట్టుకోవడం వల్ల అధిక సంఖ్యలో గాయాలయ్యాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సోషల్ మీడియా ద్వారా మృతుని గుర్తింపు

ప్రజాశక్తి - ఆదోని

మాళ మల్లేశ్వర స్వామి బన్నీ ఉత్సవాల కర్రల సమరం తొక్కిసలాటలో ఆదోని వాసి మృతి చెందారు. పట్టణంలోని అరుణ్‌జ్యోతి నగర్‌కు చెందిన చిన్న ఆంజనేయ (50) గురువారం బన్నీ ఉత్సవాలు చూసేందుకు స్థానికులతో కలిసి వెళ్లారు. మృతుని చేతికి ఉన్న 'ఎన్‌బికె' పచ్చబొట్టు వివరాలను సోషల్ మీడియాలో పోలీసులు ప్రకటించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆలూరు ప్రభుత్వాస్పత్రికి చేరుకుని గుర్తించి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో ఎలా బతకాలని మృతుని భార్య రోదించారు. మృతునికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని టిడిపి అరుణ్ జ్యోతి నగర్ వార్డు నాయకులు నాగరాజు కోరారు. విషయాన్ని బాలయ్య అభిమానులు గుర్తించి సహాయం అందేలా చూడాలని కోరారు.



హైకోర్టు బెంచికి ముందడుగు..!

- ప్రస్తుతానికి తాత్కాలిక భవనాల్లో
- నివేదిక పంపిన జిల్లా యంత్రాంగం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ముందడుగు పడింది. ఈ ఏడాదిలోనే తాత్కాలిక భవనాల్లో కార్యకలాపాల నిర్వహణకు చర్యలు తీసుకునేలా ప్రభుత్వం సన్నద్ధమైంది. అందుకు అనుగుణంగా తాత్కాలిక భవనాల గుర్తింపు ప్రక్రియను కూడా జిల్లా అధికార యంత్రాంగం పూర్తిచేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ఎన్నికల సందర్భంగా నారా చంద్రబాబు నాయుడు, యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ప్రకటన చేశారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. అందుకు అనుగుణంగా హైకోర్టుకు అనుసంధానంగా ఉన్నత న్యాయ సంస్థలైన లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ కార్యాలయాలను ఇక్కడి నుంచే కార్యకలాపాలను నిర్వహించింది. వీటితోపాటు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి, వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్ రాష్ట్ర కార్యాలయాలు ఇక్కడినుండి నిర్వహిస్తున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ఆమోదముద్ర వేసింది. గత ఏడాది కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు మంత్రి మండలి నిర్ణయం తీసుకుని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. హైకోర్టు బెంచ్ ఏర్పాటుతో రాయలసీమ ప్రాంతం నుండి హైకోర్టుకు దూర ప్రయాణం అవసరం తగ్గి, స్థానికంగా న్యాయ సేవలు లభించనున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వమే ఖర్చులన్నీ భరించాలి

హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయడానికి కొన్ని ముఖ్యమైన నిబంధనలు, విధానాలు ఉన్నాయి. భారత రాజ్యాంగం, రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ఆధారంగా నియమాలు ఉంటాయి.

ప్రధాన నిబంధనలు ప్రతిపాదన సమ్మతి: హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి వివరాలతో ప్రతిపాదన పంపాలి. దీనికోసం రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర గవర్నర్ ఆమోదముద్ర వేయాలి. మౌలిక సదుపాయాలు, ఖర్చులు వంటి వాటిపై పూర్తిస్థాయి అధ్యయనం చేయాలి. బెంచ్‌కు అవసరమైన భవనాలు, మౌలిక వసతులు, ఆర్థిక భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి. సుప్రీం కోర్టు మార్గదర్శకాలు జస్వంత్ సింగ్ కమిషన్ సూచించిన అంశాలు ప్రకారం ఈ ప్రాంతంలోని జనాభా, దూర ప్రయాణం, కేసుల పెండింగ్, న్యాయ సహాయ వనరులు, తదితర అంశాలు ఆధారంగా నిర్ణయించాలి. నిర్ణయం భావోద్వేగం, ప్రాంతీయ ఆర్థిక ఆధారంగా కాకుండా హేతుబద్ధంగా ఉండాలి. పనితీరే బెంచ్ పరిపాలన బాధ్యత ప్రధాన న్యాయమూర్తికి ఉంటుంది. జడ్జీలను అవసరానుసారం ప్రధాన కార్యాలయం నుంచి నియమిస్తారు.

తాత్కాలిక భవనాలను గుర్తించిన యంత్రాంగం

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సంబంధించిన తాత్కాలిక భవనాలను గుర్తించాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని కోరింది. ఇప్పటికే కర్నూలు నగరంలోని ఓ ప్రైవేటు విద్యాలయం, జగన్నాథ గట్టుమీద నిర్మిస్తున్న క్లస్టర్ వర్సిటీ భవనాలను పరిశీలన చేసి అధికార యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించింది. ఆ భవనాలపై రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసిన అనంతరం తాత్కాలిక భవనంలో బెంచ్ కార్యకలాపాలు కొనసాగే అవకాశం ఉంది.

16న ప్రధాని మోడీ రోడ్ షో

-రైతు బజార్ నుండి నంద్యాల చెక్‌పోస్ట్ వరకు - కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈ నెల 16న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కర్నూలులో రోడ్‌షో నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పేర్కొన్నారు. కర్నూలులోని సి క్యాంపు, రైతుబజార్ నుండి నంద్యాల చెక్‌పోస్టు వరకు రోడ్ షో ఉంటుందన్నారు. అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రధాన మోడీ పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమంత్రి పర్యటనకు సంబంధించి ఇంకా అధికారికంగా షెడ్యూల్ విడుదల కాలేదన్నారు. అయితే ప్రాథమికంగా సమాచారం అందిందని, పర్యటన కు సంబంధించి ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రధానమంత్రితో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి, డిప్యూటీ సిఎం, రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి జిల్లాకు రానున్నారని తెలిపారు. నగరంలో ప్రధానమంత్రి 4 వేల మందితో సమావేశం నిర్వహించనున్నామన్నారు. ఇప్పటినుండి పర్యటన ఏర్పాట్లపై అధికార యంత్రాంగం నిమగ్నం కావాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ, స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పిడి చిరంజీవి, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, ఆర్అండ్‌బి ఎస్‌ఇ మహేశ్వర్ రెడ్డి, జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.5 కోట్లతో చిప్పగిరి అభివృద్ధి

జిల్లాలో చిప్పగిరి బ్లాక్ రూ1.5 కోట్లతో అభివృద్ధి కార్యకలాపాలు చేపడుతున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీ నీతి ఆయోగ్ కార్యాలయం నుండి నీతి ఆయోగ్ సిఇఒ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కేంద్రంలో నుండి కలెక్టర్ డాక్టర్ సిరి పాల్గొన్నారు. నిర్దేశించిన కాల వ్యవధిలో చిప్పగిరి మండలంలో అభివృద్ధి పనులు పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నీతి అయోగ్ ద్వారా చిప్పగిరి ఆస్పిరేషనల్ బ్లాక్‌కు రూ.1.50 లక్షలు కేటాయించారు. అంగన్వాడీల అభివృద్ధికి రూ.35 లక్షలు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా అభివృద్ధి పనులకు రూ.95 లక్షలు, పాఠశాలల అభివృద్ధికి రూ.20 లక్షలతో అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. ఈ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సిపిఒ భారతి , జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, డిపిఒ భాస్కర్, హౌసింగ్ పిడి చిరంజీవి, డిఆర్‌డిఎ పిడి రమణారెడ్డి పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సిరి

ప్రజల మన్ననలు పొందిన గాయకుడు వాసు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

ప్రజా కళాకారుడు, పాటల రచయిత, గాయకుడు ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకుడు ఆర్ఎ. వాసు తన పాటల ద్వారా ప్రలజ మన్ననలు పొందారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ అన్నారు. ఆర్ఎ.వాసు 9వ వర్ధంతి సందర్భంగా కర్నూలు 43వ వార్డు ఇందిరా గాంధీ నగర్‌లో ఎం. భాస్కర్ అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, టి.రాముడులు మాట్లాడారు. శ్రమజీవుల చెమట చుక్కకు పట్టం గట్టిన మహా రచయిత, గాయకుడు అర్ఎ.వాసు అని కొనియాడరు. కష్టజీవులు జీవించే ఇందిరాగాంధీ నగర్‌లో పుట్టి పెద్దగా చదువుకో లేకపోయినా కష్టజీవుల కోసం పేద ప్రజల కోసం ఎర్రజెండా సిపిఎం చేస్తున్న పోరాటాలను ప్రజలకు కళ్ళకు కట్టినట్టుగా అనేక రచనలు చేసి ప్రజా గాయకునిగా ప్రజలలో విస్తారంగా ప్రచారం పొందారన్నారు. హమాలి కార్మికుల, చేనేత కార్మికుల, రజక వృత్తిదారుల కష్టాలను వెనకబడ్డ రాయలసీమ జిల్లాల అభివృద్ధి కోసం పాలకులు చేస్తున్న నిర్లక్ష్యాన్ని పాట రూపంలో రాసి నిప్పులు చెరిగారన్నారు. పాటలు ఉన్నంతకాలం వాసు జీవించే ఉంటాడని అన్నారు. ఆర్ఎ.సుజాత, ఆర్.మద్దిలేటి, ఎస్. రోశయ్య, అయ్యన్న, విజయ్ కుమార్, సిఐటియు నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, బికె.రామకృష్ణ, స్థానిక వార్డు ప్రజలు కార్మికులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ప్రభాకర్‌రెడ్డి, రాధాకృష్ణ, రాముడు, తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

ఖైదీలు గాంధీజీ బాటలో నడవాలి

-జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఖైదీలు సత్ప్రవర్తనతో జాతిపిత మహాత్మా గాంధీ చూపిన అహింస, శాంతి బాటలో నడవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సి సూచించారు. గురువారం పంచలింగాల గ్రామ సమీపంలోని జిల్లా కారాగారంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలను వేసి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలావెంకట శేషాద్రి లు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఖైదీల సంక్షేమ దినోత్సవంలో పాల్గొన్నారు.కలెక్టర్ మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ జయంతి రోజునే ఖైదీల సంక్షేమ దినోత్సవం కూడా జరుపుకుంటున్నామన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ అహింస, శాంతి బాటలలో నడిచి దేశానికి స్వాతంత్రం తీసుకొని వచ్చారన్నారు. ఖైదీలందరూ సత్ ప్రవర్తనతో నడుచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకునేందుకు అవసరమైన స్కిల్ డెవలప్మెంట్ కోర్స్‌లను ఖైదీలకు అందించే విధంగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలావెంకట శేషాద్రి మాట్లాడుతూ ప్రతి మనిషి నేరం చేయాలనే ఆలోచన మనసు నుండి తీసివేసి స్వేచ్ఛగా బతకాలని ఖైదీలకు సూచించారు. ఒక్కసారి జైలుకు వచ్చిన వ్యక్తి మళ్లీ జైలుకు రాకుండా చూసుకోవాలన్నారు. సదరన్ రీజియన్ హోమ్ గార్డ్ కమాండెంట్ మహేష్ కుమార్, జిల్లా కారాగారం సూపరింటెండెంట్ వేణుగోపాల్ రెడ్డి, జి జి హెచ్ సూపరింటెండెంట్ డా .వెంకటేశ్వర్లు, జిల్లా కారాగారం సిబ్బంది, ఖైదీలు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల పనిముట్లపై జిఎస్‌టి తగ్గింపు

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్



డైరెక్టర్ మాట్లాడుతున్న పోతుల శేఖర్

మత్స్యకారుల పనిమిట్లపై జిఎస్‌టి 18 నుండి 5 శాతానికి తగ్గిందని జిఎస్‌టి డిప్యూటీ డైరెక్టర్ శైలజ అన్నారు. శుక్రవారం కర్నూలు మత్స్యశాఖ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిఎస్‌టి డిప్యూటీ డైరెక్టర్ శైలజ మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సంధ్యారాణి, జిల్లా మత్స్య సహకార సంఘం డైరెక్టర్ పోతుల శేఖర్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మత్స్యకారుల పనిముట్లపై జివిస్టి తగ్గించడం వల్ల ఎంతో లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. మత్స్యశాఖ అధికారులు మద్దిలేటి, మల్లికార్జున, శ్రీనివాసులు, అరుణ, కాంతి మత్స్య సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్, గాంధీ స్ఫూర్తితో పోరాటం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



క్రికెట్ విజేతలకు కప్‌ను అందజేస్తున్న పిఎస్.రాధాకృష్ణ

భగత్ సింగ్,మహాత్మా గాంధీల జయంతి సందర్భంగా డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నగర కమిటీల ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. 2వ రోజు జరిగిన క్రికెట్ టోర్నమెంట్ లో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు అబూబాకర్, డివైఎఫ్ఐ నగర ఉపాధ్యకులు ధనుష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు ముందుగా భగత్ సింగ్, మహాత్మా గాంధీల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. డివైఎఫ్ఐ మాజీ నాయకులు పిఎస్.రాధాకృష్ణ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.రాఘవేంద్ర, నగర కార్యదర్శి హుస్సేన్ భాష, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్ మాట్లాడుతూ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా భారతదేశ స్వాతంత్రం కోసం ఎన్నో పోరాటాలు నిర్వహించిన ఘనత గాంధీ, భగత్ సింగ్ అని అన్నారు. భగత్ సింగ్ 23 సంవత్సరాల వయసులోనే దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన దేశభక్తుడని వారు కొనియాడారు. వారి ప్రాణ త్యాగ ఫలితమే నేడు భారతదేశ స్వాతంత్రంఅని వారు తెలిపారు. టోర్నమెంట్ లో గెలుపొందిన విన్నర్స్‌కు టీంకు పిఎస్. రాధాకృష్ణ చేతుల మీదుగా రూ.5,000, మెమెంటో,రన్నర్స్‌టీంకు రూ.2,500, మెమెంటో మాజీ డివైఎఫ్ఐ నాయకులు చేతుల మీదుగా ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర నాయకులు విజయ్, ధను, శ్రావణ్, ఎస్ఎఫ్ఐ నగర నాయకులు పథ్వీ మాజీ డివైఎఫ్ఐ నాయకులు ఆజాద్,విజయ్,సురేష్,గిరి అలాగే క్రికెట్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అహింసతో సాధించిన విజయం గొప్పది

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్: హింసతో సాధించే గెలుపుకన్నా, అహింసతో సాధించిన విజయం ఎంతో గొప్పదని చాటి చెప్పిన మహనీయుడు మహాత్మాగాంధీ అని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ చెప్పారు. గురువారం గాంధీ జయంతి సందర్భంగా నగరపాలక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిషనర్ మాట్లాడుతూ... సత్యం, అహింసలను తన అస్త్రాలుగా మార్చుకుని దేశానికి స్వాతంత్ర్యం సాధించి పెట్టిన మహనీయుడు పూజ్య బాపూజీ అని కీర్తించారు. మహాత్ముడు చూపిన దారిలో నేటి యువత ముందుకు సాగాలన్నారు. భావితరాలకు మహనీయుల త్యాగాలను వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి, మేనేజర్ ఎన్.చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఇన్‌ఛార్జి ఎస్ఇ శేషసాయి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అనిల్ పాల్గొన్నారు.



కోడుమూరు: ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో కోడుమూరులో మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని పాత బస్టాండులో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జిపి వీరన్న అధ్యక్షతన చేనేత జిల్లా అధ్యక్షుడు కె.లక్ష్మన్న, బి శేఖర్, చేనేత కార్మికులు కలిసి నూలు దారం చిట్టలు పూలమాలలు వేసి వేశారు. సర్పంచి భాగ్యరత్న అధ్యక్షుతన నర్వహించారు

కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవం

-వాడవాడలా ఎగిరిన సామాజిక ఉద్యమ పతాకాలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : సామాజిక ఉద్యమ రథసారథి కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం 28వ ఆవిర్భావ వారోత్సవాలలో భాగంగా వాడవాడలా కెవిపిఎస్ పతాకాలను ఎగరవేసి శుభాకాంక్షలు తెలిపారు. కర్నూలు బుధవారపేటలో ఉన్న కెవిపిఎస్ జిల్లా కార్యాలయంలో నగర కార్యదర్శి ఎం.భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు పథకాన్ని ఆవిష్కరించారు. ఇందిరా గాంధీ నగర్‌లో మద్దిలేటి అధ్యక్షతన జరిగిన పతాకావిష్కరణలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, సిఐటియు జిల్లా నాయకులు టి. రాముడు, కెవిపిఎస్ నగర కార్యదర్శి ఎం.భాస్కర్, నగర ఉపాధ్యక్షులు రోషి పాల్గొన్నారు. గోనెగండ్ల మండలం ఎర్రబాడు గ్రామంలో కెవిపిఎస్ పతాకాన్ని సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.దేవ సహాయం ఆవిష్కరించారు. జయరాజు తదితరులు పాల్గొన్నారు. ముజఫర్‌నగర్‌లో వార్డు కార్యదర్శి సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యక్షులు రామాంజనేయులు పతాకాన్ని ఆవిష్కరించారు. నగర ఉపాధ్యక్షులు చిన్న ఆనంద్, సిఐటియు నగర నాయకులు సుధాకరప్ప, సాయిబాబా, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి హుస్సేన్ బాషా పాల్గొన్నారు. జొహరాపురంలో కెవిపిఎస్ నగర అధ్యక్షులు రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నగర నాయకులు రంగస్వామి పతాకాన్ని ఆవిష్కరించారు. మాజీ నగర కార్యదర్శి విజయ్ నాయకులు నాగరాజు మాట్లాడారు. న్యూ సిటీ అధ్యక్షులు యేసురాజు అధ్యక్షతన షరీన్‌నగర్, కల్లూరు ప్రాంతాల్లో పతాకాలను సివి.వర్మ, ఆనంద్ బాబు ఎగరవేశారు. కౌతాళం మండలం సులేకేరి, రొడూరు, లింగాలదిన్నె, ఈర్లదిన్నె, బంటకుంట గ్రామాలలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె. మల్లయ్య, కెవిపిఎస్ మండల అధ్యక్షులు మారయ్య, కాటికాపరుల సంఘం మండల అధ్యక్షులు తాయప్ప, చర్మకారుల సంఘం నాయకులు ఆదాం జెండాను ఆవిష్కరించారు. గోనెగండ్ల మండల కేంద్రంతో పాటు ఐరన్ బండ గ్రామాల్లో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.కరుణాకర్ తతాకాన్ని ఆవిష్కరించారు. ఆదోని మండలం సంతెకుడ్లూరు గ్రామంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి బి. తిక్కప్ప, బసరకోడు గ్రామంలో మండల అధ్యక్షులు మునుస్వామి జెండాను ఆవిష్కరించారు. ఎమ్మిగనూరు పట్టణంలో మూడు ప్రాంతాలలో పట్టణ కార్యదర్శి ఆంథోని, అధ్యక్షులు గుం టెప్ప పతాకాలను ఆవిష్కరించారు. కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ పెద్దబాబు, తిమ్మన్న, రాజా రమేష్, చిన్నప్ప, ప్రదీప్, దేవదాసు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్‌బాబు



మాట్లాడుతున్న డీఇఒ ఎస్ శామ్యూల్ పాల్

ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభం

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

డీఇఒ ఎస్ శామ్యూల్ పాల్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

డిఎస్‌సి ఎంపికైన ఉపాధ్యాయులకు శుక్రవారం నుండి కర్నూలు నగరంలో మూడు కేంద్రాలలో శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. కర్నూలు నగర శివారులలోని మూడు ప్రయివేటు కేంద్రాల్లో ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆన్‌లైన్ ద్వారా రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు, సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం జిల్లా విద్యాధికారి ఎస్.శ్యామ్యూల్‌పాల్ రాష్ట్రంలో కనివిని ఎరుగని రీతిలో మన జిల్లా పోస్టులు మంజూరయ్యాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో దాదాపు అన్ని పోస్టులు నియామకాలు చేయగలిగామన్నారు. ఇక తక్షణ కర్తవ్యం విద్యారంగంలో మన జిల్లాను రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేయాలని కోరారు. ప్రణాళిక బద్ధంగా రిసోర్స్ పర్సన్స్ జాగ్రత్తగా నోట్ చేసుకొని ఆచరణాత్మక కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ శిక్షణా తరగతుల్లో జిల్లా వ్యాప్తంగా మండల విద్యాధికారులు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

దోమలు పెరగకుండా చర్యలు

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్



తెలుగు గేరిలో జరుగుచున్న ఫ్రైడే-డ్రై డే కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులశెట్టి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దోమలు వర్షాకాలంలో వృద్ధి చెందుతాయని, దోమల ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. డెంగీ,మలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు, మలేరియాలాంటి వ్యాధులు దోమ కాటు ద్వారా వస్తాయని తెలిపారు. దోమలు పెరగకుండా ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ శుక్రవారం డ్రై డే గా పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని, ఇంట్లోకి దోమలు రాకుండా సాయంత్రం వేళ తలుపులు మూసి ఉంచాలని, దోమ కాటు నుంచి రక్షణ కోసం తెరలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఆరోగ్య కార్యకర్త, ఆశా కార్యకర్త తిరుపతమ్మ మరియు ప్రాజెక్షనీస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న నాయకులు

మెడికల్ కళాశాల కోసం సమిష్టి పోరాటం

- సాధన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మెడికల్ కళాశాల ప్రయివేట్ పరం కాకుండా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా సమిష్టి ఉద్యమానికి ప్రజా, విద్యార్థి, రాజకీయ పార్టీలు సన్నద్ధమయ్యాయి. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రయివేటీకరణ తగదంటూ నినదించారు. శుక్రవారం ఆదోనిలో మెడికల్ కళాశాల సాధన కమిటీని ఎన్నుకున్నారు. సాధన కమిటీ గౌరవాధ్యక్షులుగా దేవిశెట్టి ప్రకాష్, యుజి.శ్రీనివాసులు, నూర్ అహ్మద్, ఫయాజ్ అహ్మద్, కన్వీనర్గా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, కో కన్వీనర్గా దస్తగిరి, అజిద, రమేష్, సోమశేఖర్, ఉదయ్, తిరుమలేష్, కమిటీ సభ్యులుగా శ్రీనాథ్, సద్దాం, బాలు, నాగరాజ్, తిప్పన్న, వెంకటేష్, అజిత్ గౌడ్, భాస్కర్, శ్రీనివాసులు, నూర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సాధన కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు మాట్లాడారు. ఆదోని అభివృద్ధికి తలమానికమైన మెడికల్ కళాశాల కోసం సమిష్టి పోరాటాలకు సాధన కమిటీ పనిచేస్తుందని తెలిపారు. 60 శాతం నిర్మాణం పూర్తయిన ఆదోని మెడికల్ కళాశాలను ప్రభుత్వమే పూర్తి చేసి తరగతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలకు ప్రయివేటీకరణ దుర్మార్గమని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చాక మెడికల్ కళాశాల పనులను నిలిపివేసి పిపిపి విధానంలో కొనసాగించడానికి కేబినెట్ తీర్మానం చేయడం భావ్యం కాదన్నారు. ప్రయివేటీకరణతో పేదలకు వైద్యం అందే పరిస్థితి ఉండదని తెలిపారు. వైద్య విద్య ప్రయివేటీకరణ ఆలోచనలను విరమించుకోవాలని కోరారు. ఎన్ఎంసికి రాసిన లేఖను రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

'కూటమి'తో ఆర్థిక చేయూత

- టిడిపి కన్వీనర్ లాయర్ షేక్షావలీ, మాజీ ఎంపిటిసి భాస్కర్

ప్రజాశక్తి - చిప్పగిరి


రాధమ్మకు పింఛను అందజేస్తున్న నాయకులు

సంక్షేమ పథకాలకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఆర్థిక చేయూతనందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి మండల కన్వీనర్ లాయర్ షేక్షావలీ, మాజీ ఎంపిటిసి భాస్కర్ యాదవ్ తెలిపారు. శుక్రవారం సంగాల గ్రామంలో నియోజకవర్గ ఇన్ఛార్జి వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు డయాలసిస్ రోగి రాధమ్మకు షేక్షావలీ, భాస్కర్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి బాలన్న చేతులమీదుగా రూ.10 వేలు పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ఎవరూ అధైర్యపడవద్దని, ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే ఇన్ఛార్జికి సమాచారమిచ్చి పరిష్కరిస్తామని తెలిపారు. టిడిపి నాయకులు చంద్ర, రంగనాథ్, సుంకయ్య, బాబు, నెట్టికల్లు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత నందవరం దుర్గా టీం

- బహుమతులను అందించిన మాధవరావు దేశాయ్

ప్రజాశక్తి - నందవరం

దసరా పండగ సందర్భంగా నందవరం గ్రామంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో నందవరం దుర్గా టీం విజేతగా నిలిచింది. టిడిపి నాయకులు మాధవరావు దేశాయ్ నిర్వహించిన ఈ పోటీల్లో 30 టీములు పాల్గొనగా రెండు రోజులుగా హోరాహోరీగా పోటీలు జరిగాయి. నందవరం గ్రామానికి చెందిన దుర్గా టీమ్ విజేతగా నిలిచింది. దుర్గా టీమ్కు రూ.10,116, రెండో స్థానంలో నిలిచిన పూలచింత టీమ్కు రూ.5,116, మూడో స్థానంలో నిలిచిన ఆదోని టీమ్కు రూ.3,116 నగదు బహుమతులను మాధవరావు దేశాయ్ శుక్రవారం అందించారు. మరింత మెరుగైన ప్రతిభతో క్రీడల్లో రాణించి గ్రామానికి పేరు తేవాలని ఆయన ఆకాంక్షించారు. టిడిపి నాయకులు తిమ్మరాజు, రాజోలి మోహన్, దండు నాగరాజు, చెంచు బంగారి, వడ్డే మురళీ, చుక్క మునిస్వామి, చెంచు నరసింహులు, మేకల హనుమంతు, చెంచు భాస్కర నాయుడు, బెస్త ఈరన్న, చాకలి మల్లికార్జున, చాకలి వెంకటేష్, చాకలి శ్రీనివాసులు, నరసింహులు, నాగరాజు, నజీర్ పాల్గొన్నారు.


బహుమతులు అందిస్తున్న మాధవరావు దేశాయ్

మిరప రైతు కంట కన్నీరు..!

- అకాల వర్షాలతో నష్టం - గిట్టుబాటు ధర కరువు

ప్రజాశక్తి - కౌతాళం

నియోజకవర్గంలోని మండలాల్లో మిరప సాగు చేసిన రైతు కంట కన్నీరు పెడుతున్నారు. ఈ ఏడాది బాగా వర్షాలు కురవడంతో మిరప పంట బాగా పండుతుందని, తమ కష్టాలు తీరుతాయని రైతులు ఎంతో ఆశపడ్డారు. రైతు ఆశలపై ప్రకృతి కన్నెర్ర చేసింది. అకాల భారీ వర్షాలతో పంటలు దెబ్బతిని వారి ఆశలు అడియాశలు అయ్యాయి. గతేడాది పండించిన పంటలకే ఇప్పటి వరకు గిట్టుబాటు ధర లేక చాలామంది రైతులు గిడ్డంగుల్లో నిల్వ చేశారు. ప్రస్తుతం సాగు చేసిన పంటలు అధిక వర్షాలతో దెబ్బతిని రైతులకు ఈ ఏడాది కూడా నష్టాలే మిగిలాయి..!


మిరప పంటను చూపుతున్న రైతు

మంత్రాలయం నియోజకవర్గంలోని కౌతాళం, కోసిగి, పెద్దకడబూరు, మంత్రాలయం మండలాల్లో పత్తి, మిరప, వరి, వేరుశనగ తదితర పంటలను రైతులు సాగు చేశారు. తుంగభద్ర దిగువ కాలువ సాగు నీటి సౌకర్యం ఉండడంతో రైతులు మిరప పంట ఎంతో ఆసక్తితో సాగు చేశారు. గతేడాది మిరప పంట దిగుబడి తగ్గడంతో, గిట్టుబాటు ధర లేకపోవడంతో ఈ ఏడాది మిరప సాగు గతంలో కంటే కొంతవరకు తగ్గింది. కౌతాళం మండలంలో 4,125 ఎకరాలు, మంత్రాలయంలో 1,750, కోసిగిలో 2,250, పెద్దకడబూరు మండలంలో 3,750 ఎకరాల్లో మిరప పంట సాగునట్లు హార్టికల్చర్ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలకు మిరప పంటకు తేమశాతం ఎక్కువ కావడంతో దెబ్బతినింది. పంటలను కాపాడుకునేందుకు రైతులు పడిన కష్టాలు అన్ని ఇన్ని కావు..! మిరప పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండడంతో మిరప చెట్లు చచ్చిపోతున్నాయి.

ఎకరాకు రూ.80 వేలు పెట్టుబడి

- రైతు పంపాపతి, హాల్వి గ్రామం

మిరప పంట సాగుకు రూ.80 వేల పెట్టుబడి పెట్టాను. మూడెకరాల్లో మిరప పంట సాగు చేశాను. అధిక వర్షాలతో పంట మొత్తం దెబ్బతినింది. ప్రభుత్వం మిరప రైతులను ఆదుకోవాలి.

రైతులకు నష్టపరిహారం అందించాలి

- రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య



జిల్లాలో మిరప పంట సాగు చేసిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలి. అధిక వర్షాలతో పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారు. రెండేళ్ల నుంచి జిల్లాలో మిరప పంట సాగు చేసిన రైతుల పరిస్థితి చాలా ఘోరంగా ఉంది. ప్రభుత్వం రైతులను ఆదుకోకపోతే ఆందోళనలు చేపడతాం.

నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి

- హార్టికల్చర్ అధికారి అర్చన, మంత్రాలయం



మిరప పంట సాగు చేసిన రైతులు పొలాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ప్రస్తుతం వాగులు, వంకలు ఉన్న ప్రాంతంలో పంటలు దెబ్బతిన్నాయి. వర్షాలు ఇలాగే కొనసాగితే మిరప పంట దెబ్బతినే ప్రమాదం ఉంది.



నేడు ఛైర్మన్ ప్రమాణ స్వీకారం

- టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ జిందే శారద ప్రమాణ స్వీకారానికి భారీగా తరలిరావాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. శనివారం ఉదయం టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి మీనాక్షి నాయుడు స్వగృహం నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డుకు ర్యాలీగా చేరుకుంటారన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో స్టేజిపై అధికారుల సమక్షంలో ఛైర్మన్తో పాటు కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. కమిటీ నాయకులు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, అధికారులు, ఇతర పార్టీల నాయకులు భారీగా తరలి రావాలని కోరారు. ఇక్కడ వచ్చిన వారికి భోజన సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. నాయకులు వెంకట రాముడు, జిందే శంకర్, మారుతి నాయుడు, వెంకటేష్ చౌదరి, జిందే శారద తనయుడు అడ్వకేట్ ఈరన్న ఉన్నారు.

రాంపురం రెడ్డి సోదరుల విజయమే లక్ష్యం

- వైసిపి రాష్ట్ర కార్య నిర్వాహక మండలి సభ్యులు పురుషోత్తం రెడ్డి, మండల అధ్యక్షులు భీమారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

రాంపురం రెడ్డి సోదరుల విజయమే లక్ష్యంగా పని చేస్తానని వైసిపి రాష్ట్ర కార్య నిర్వాహక మండలి సభ్యులు కంపాడు ఆర్.పురుషోత్తం రెడ్డి, మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని రాంపురం గ్రామంలో వై.సీతారామిరెడ్డిని, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురిని శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీతారామిరెడ్డి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి, యువ నాయకులు ధరణీధర్ రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని మరోసారి గెలిపించుకుని మంత్రిని చేసుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. రామ్మోహన్ రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ చంద్ర శేఖర్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఈరన్న, జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి గజేంద్ర రెడ్డి, నాయకులు లక్ష్మి నారాయణ రెడ్డి, జడ్పిటిసి జాము ముకయ్య, జిల్లా యూత్ కార్యదర్శి శివ రామి రెడ్డి, సర్పంచులు రామాంజినేయులు, చంద్రశేఖర్, మాజీ విఆర్ఒ రామలింగారెడ్డి, ఉరుకుంద ఈరన్న స్వామి ట్రస్టు బోర్డు మాజీ సభ్యులు విజయేంద్ర రెడ్డి, వాణిజ్య విభాగం మండల అధ్యక్షులు బ్రహ్మయ్య, వాలంటీర్స్ విభాగం నియోజక వర్గ కన్వీనర్ జాము వీరేష్ పాల్గొన్నారు.


రాంపురం రెడ్డి సోదరులను సన్మానిస్తున్న నాయకులు

ముగిసిన బీవీ స్మారక క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - గోనెగండ్ల

మాజీ మంత్రి కీర్తిశేషులు బీవీ.మోహన్ రెడ్డి స్మారక క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. గోనెగండ్లలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్కు ముఖ్యఅతిథిగా ఎమ్మిగనూరు వ్యాపారవేత్త, టిడిపి నాయకులు భాస్కర్ల చంద్రశేఖర్ హాజరయ్యారు. మొదటి బహుమతి రూ.30,016 ఎమ్మిగనూరు 11 జట్టుకు, రెండో బహుమతి గోనెగండ్ల పవర్ హిట్టర్స్ జట్టుకు రూ.20,016 ఆయన అందజేశారు. క్రికెట్ పోటీలను ఏర్పాటు చేసిన నిర్వాహకులు ఐరన్ బండ బాష, అల్వాల సర్పంచి బాషతో పాటు ఆర్గనైజర్లుగా సహకారం అందించిన టిఎన్ఎస్ఎఫ్ రమేష్, జిలాని బాష, రాంపురం రఫీక్, ఐటిడిపి రవిని అభినందించారు. యువతలో స్ఫూర్తిని నింపే ఇలాంటి కార్యక్రమాలకు ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి తో పాటు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన తెలిపారు. టిడిపి మండల కన్వీనర్ తిరుపతయ్య, మండల ప్రధాన కార్యదర్శి రమణ చౌదరి, మార్కెట్ యార్డు ఛైర్మన్ మల్లయ్య, పట్టణ అధ్యక్షులు రహమతుల్లా, జడ్పి హైస్కూల్ ఛైర్మన్ రాంపురం రంజాన్, మండల మాజీ అధ్యక్షులు నజీర్ సాహెబ్, కైరవాడి సింగిల్ విండో ఛైర్మన్ తిమ్మారెడ్డి, బందేనవాజ్, మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, సొగనూరు జగదీష్, సందీప్ నాయుడు, జైపాల్, అడ్వకేట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.


విజేతలకు బహుమతి అందజేస్తున్న నాయకులు

కరివేములలో వరుస దొంగతనాలు

- భయాందోళనలో గ్రామస్తులు

ప్రజాశక్తి- దేవనకొండ


మండలంలోని కరివేముల గ్రామంలో వరుస దొంగతనాలతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గత 10 రోజుల క్రితం గ్రామానికి చెందిన హుసేని ఇంట్లో పనులకు వెళ్లిన సమయంలో మధ్యాహ్నం దొంగలు ప్రవేశించి 4 తులాల బంగారం, కిలో వెండి ఎత్తుకెళ్లారు. అలాగే నాలుగు రోజుల క్రితం నాగన్న, దాసరి చంద్రన్న ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు 2 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. గత రెండు రోజుల క్రితం కటికే నరసోజి ఇంట్లో దొంగలు బీరువా పగులగొట్టి 5 తులాల బంగారు, కిలో వెండి, రూ.50 వేల నగదు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు నామమాత్రంగా గ్రామానికి వచ్చి పరిశీలించి పోతున్నారే తప్ప ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల్లో రికార్డు అయినప్పటికీ దొంగలను పట్టుకోవడంలో పోలీసులు విఫలమైనట్లు గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత పోలీసు ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేసి దొంగలపై నిఘా ఉంచి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గ్రామీణ క్రీడలను బతికించాలి

- డిఇఒ శ్యామూల్ పాల్
- ఘనంగా ముగిసిన కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - మంత్రాలయం

రోజురోజుకు కనుమరుగవుతున్న గ్రామీణ క్రీడలను బతికించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని డిఇఒ ఎస్.శ్యామూల్ పాల్, డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రామన్న, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ తెలిపారు. గురువారం పెద్దకడబూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ముందుగా మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భగత్ సింగ్, మహాత్మ గాంధీ జయంతి వారోత్సవాల సందర్భంగా ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సమాజంలో పెరుగుతున్న మాదకద్రవ్యాలను అరికడదామని, మంచి సమాజాన్ని నిర్మిద్దామంటూ తెలిపారు. ఆటలు కొద్దిమందికే అందుబాటులో ఉండడం బాధాకరమన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకు డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలోనూ క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని కోరారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి జె.రాజు, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కె.విల్సన్, కెవిపిఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.దాసు, రామన్న, వ్యకాస జిల్లా నాయకులు ఈ.తిక్కన్న, డివైఎఫ్ఐ నాయకులు సతీష్, మేషేకు, కల్యాణ్, రాజు, సురేష్, వెంకటేష్, పీడీలు రాము, దుబ్బన్న, ప్రయివేట్ పాఠశాలల సంఘం నాయకులు గోవిందరెడ్డి పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న డిఇఒ శ్యామూల్ పాల్

జగ్గాపురం విజేత

ఈ పోటీల్లో దాదాపు 22 జట్లు పాల్గొన్నాయి. మొదటి బహుమతి సాధించిన జగ్గాపురం జట్టుకు డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, వ్యకాస జిల్లా నాయకులు ఈ.తిక్కన్న చేతులమీదుగా రూ.20 వేల బహుమతి అందించారు. రెండో బహుమతి ఆస్పరి జట్టుకు రామాంజనేయులు సోదరుడు ఓలేప్ప చేతులమీదుగా రూ.10 వేలు, మూడో బహుమతి ఆదోని జట్టుకు కెవిపిఎస్ మండల కార్యదర్శి బి.దాసు, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి జె.రాజు, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జె.రాజు చేతులమీదుగా అందజేశారు. డివైఎఫ్ఐ నాయకులు శంకర్, మేషేకు, కల్యాణ్, రాజు, నాగిరెడ్డి, నరసింహ, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.కల్యాణ్, రాజు, ప్రశాంత్ పాల్గొన్నారు.

6న చలో కలెక్టరేట్

- ఎస్జికెఎస్ జిల్లా అధ్యక్షులు తిక్కప్ప

ప్రజాశక్తి - ఆదోని

వల్లకాడు బతుకుల భరోసా కోసం ఈనెల 6న చేపట్టే 'చలో కలెక్టరేట్'ను జయప్రదం చేయాలని ఎస్జికెఎస్ జిల్లా అధ్యక్షులు తిక్కప్ప కోరారు. శుక్రవారం పట్టణంలోని హిందూ స్మశాన వాటిక వద్ద శ్మశానంలో గుంతలు తీసే పూడ్చే, కాల్చే కాటికాపరుల సంఘం సమావేశం నిర్వహించారు. కెవిపిఎస్ మండల అధ్యక్షులు మునిస్వామి అధ్యక్షత వహించారు. బి.తిక్కప్ప, సంఘం పట్టణ కార్యదర్శి యువరాజు మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి నాలుగో తరగతి ఉద్యోగులుగా నియమించాలని, గుర్తింపు కార్డులిచ్చి, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు జయరాం, లక్ష్మన్న, బన్ని, హనుమంతు పాల్గొన్నారు.

గుంతలు కూడా పూడ్చలేరా..?

- ఎంహెచ్పిఎస్ రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

రోడ్డుకు గుంతలు కూడా పూడ్చలేని పరిస్థితుల్లో అధికారులు ఉండడం విడ్డూరంగా ఉందని, స్పందించకపోతే తామే మరమ్మతులు చేయిస్తామని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ తెలిపారు. మార్కెట్ యార్డు సమీపంలోని మాధవరం రోడ్డులో నీరు నిలిచి చెరువును తలపిస్తున్న రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని మార్కెట్ యార్డు రోడ్డు అధ్వానంగా మారిందని, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. అధికారులతో పని చేయించడంలో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి విఫలం చెందారన్నారు. నరేంద్ర యాదవ్, హాఫీజ్ ఉన్నారు.




కుల వివక్షకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు

- కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవ సహాయం

ప్రజాశక్తి - గోనెగండ్ల

కుల వివక్షకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు కొనసాగించాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవసహాయం కోరారు. శుక్రవారం గోనెగండ్లతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో కెవిపిఎస్ 28వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండావిష్కరణలు చేపట్టారు. ఎర్రబాడులో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవసహాయం, ఐరన్ బండలో కెవిపిఎస్ నాయకులు చంద్రన్న, నజీర్, గోనెగండ్లలోని గంజహళ్లి క్రాస్ రోడ్ వద్ద కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు, ఎపిడికెఎస్ జిల్లా కార్యదర్శి కరుణాకర్లు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కెవిపిఎస్ జెండాలను ఆవిష్కరించారు. ఎపిడికెఎస్ మండల అధ్యక్షులు మాణిక్యం, మండల మాజీ అధ్యక్షులు మారేష్, దేవదాస్, కెజిబిఎస్ నాయకులు సల్వాది రంగన్న, ఆయా సంఘాల నాయకులు మారెప్ప, నాగేశ్వరరావు, దేవదాస్, జి.రంగన్న, మల్లికార్జున, శంకర్, చిన్న కొండయ్య, హమాలీ సంఘం నాయకులు మారెప్ప, సోమన్న, రంగస్వామి, చిన్న మద్దిలేటి, చంద్రయ్య, కృష్ణ, పేతురు, జయరాజు, సుంకన్న, దినకర్, శాంతిరాజు, కరుణాకర్, నాగరాజు, రత్నమయ్య, రామాంజిని, గోవిందు, నడిపి మునిస్వామి పాల్గొన్నారు. **మంత్రాలయంలో**ని అంబేద్కర్ సర్కిల్లో కెవిపిఎస్ మండల కార్యదర్శి అంజి ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు సురేష్, ఉపాధ్యక్షులు మారెప్ప అధ్యక్షతన కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.జయరాజు, సీనియర్ నాయకులు అనిల్ ముఖ్య అతిథులుగా పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాటికాపరుల సంఘం నాయకులు ఏలియా, హనుమంతు, ఆంజనేయ, డప్పు కళాకారుల సంఘం నాయకులు తిక్కయ్య, భీమన్న, చర్మకారులు డేవిడ్, వీరేష్, కెవిపిఎస్ నాయకులు దేవపుత్ర, ఆటో దేవ పాల్గొన్నారు.


ఐక్యతను చాటుతున్న కెవిపిఎస్ నాయకులు

దాసరి మేరీకి సన్మానం

- డీఎస్సీ ఫలితాల్లో టిజిటి ఉపాధ్యాయులుగా ఎంపిక

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి గ్రామానికి చెందిన దాసరి ఓబులేసు, రాణెమ్మ దంపతుల ఏకైక కుమార్తె దాసరి మేరీ డీఎస్సీ ఫలితాల్లో టిజిటి ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. చిప్పగిరి గ్రామ వాసి, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సిఐగా విధులు నిర్వహిస్తున్న రమేష్ బాబు గురువారం తన నివాసంలో చిప్పగిరి సర్పంచి దాసరి గోవిందరాజులు, కుటుంబ సభ్యులతో కలిసి దాసరి మేరీని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిఐ రమేష్ బాబు మాట్లాడారు. చిప్పగిరిలోని దళిత కాలనీలో దాసరి కుటుంబం ప్రజాసేవకు అంకితమైందని కొనియాడారు. ఈ నేపథ్యంలో దాసరి మేరీ కూడా ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం వారి కుటుంబ సేవా దాతృత్వమే కారణమని తెలిపారు. మేరీ అవ్వతాతలు రైల్వే ఉద్యోగిగాను, మేరీ చిన్నాయన దాసరి నారాయణస్వామి ఉపాధ్యాయ వృత్తి నుంచి ప్రధానోపాధ్యాయులుగా, మేరీ ఇంకొక చిన్నాయన చిప్పగిరి సర్పంచిగా, సర్పంచి కుమారుడు దేశ ప్రజాసేవలో ఆర్మీ ఉద్యోగిగా ఉంటున్నారని చెప్పారు. దాసరి మేరీ చదువుతుండగా తండ్రి దాసరి ఓబులేసు ఆకస్మికంగా మృతి చెందడంతో, ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న చిన్నాయన నారాయణస్వామి తన దగ్గర ఉంచుకొని మంచి చదువులు చదివించారని తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా దాసరి మేరీని తన కుటుంబ సభ్యులతో కలిసి సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. ముమ్ముందు కూడా దాసరి కుటుంబ సభ్యులు ప్రజాసేవలో మరింత అంకితం కావాలని ఆకాంక్షించారు. సర్పంచి సతీమణి పద్మావతి, సిఐ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


దాసరి మేరీని సన్మానిస్తున్న సిఐ రమేష్



వైభవంగా గంధోత్సవం

ప్రజాశక్తి - కౌతాళం

మహబూబ్ సుభాని ఉత్సవాల్లో భాగంగా స్వామివారి గంధోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉరుసు ఉత్సవాల సందర్భంగా దర్గాను విద్యుద్దీపాలంకరణ చేశారు. స్వామి వారి గంధత్వం ఊరేగింపుగా తీసుకెళ్లి మాబు సుభాని దర్గాలో స్వామి వారి జెండాను ప్రతిష్ఠించారు. గంధోత్సవంలో గ్రామస్తులు, ప్రముఖులు, టిడిపి పట్టణ అధ్యక్షులు డాక్టర్ రాజానందు పాల్గొని పూజలు నిర్వహించారు.


త్వరలో ఓపెన్ ఇసుక రీచ్లు

- జిల్లా గనులు, భూగర్భ శాఖాధికారి - ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - నందవరం

నందవరం మండలంలో త్వరలో ఓపెన్ ఇసుక రీచ్లు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖాధికారి వి.రవిచంద్ శుక్రవారం తెలిపారు. గత నెల 26న ప్రజాశక్తిలో ప్రచురించిన 'ఉచిత ఇసుక ఉత్తిదే' కథనానికి ఆయన స్పందించారు. మండలంలో ఇసుక కొరత, అధిక ధరల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రూ.4,500 వెచ్చించినా ఇసుక రావడం లేదు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ప్రజాశక్తి కథనాన్ని ప్రచురించింది. ఆ కథనంతో జిల్లా అధికారులు స్పందించారు. త్వరలో నాగలదిన్నె, గంగవరం ప్రాంతాల్లో ఓపెన్ ఇసుక రీచ్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక ప్రజలకు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. మండల ప్రజలు కోరుకున్న విధంగా ఇసుక లభిస్తుందని తెలిపారు. ప్రజలకు అందుబాటులో రీచ్ ఉండడం వల్ల తక్కువ ఖర్చుతో ఇసుక లభిస్తుందని చెప్పారు. ప్రస్తుతం వ్యక్తిగత వినియోగం, కమ్యూనిటీ పనుల కోసం వినియోగదారులకు ఇసుక ఉచితంగా లభ్యమయ్యే పరిసర ప్రాంతాల్లో తీసుకోవచ్చని తెలిపారు.

వెంకటప్రసాద్ రావుకు శివప్రసాద్ పరామర్శ



ప్రజాశక్తి - హోళగుంద

ఎల్ఎల్సి డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ శ్రీమిక్కిలినేని వెంకట ప్రసాద్ రావును టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ పరామర్శించారు. ప్రసాద్ రావు తండ్రి మృతి చెందడంతో శుక్రవారం మండలంలోని కున్నూరు క్యాంపులోని వారి స్వగృహానికి చేరుకొని పరామర్శించారు. టిడిపి సీనియర్ నాయకులు చిన్నహ్యాట శేషగిరి, విష్ణువర్ధన్ రెడ్డి, రాజా పంపనగౌడ్, బాబీ, గోవిందగౌడ్, మురళీధర్, కాడప్ప, ఎర్రిస్వామి, దిడ్డి వెంకటేష్, తోక వెంకటేష్, గిరి, వలీ బాష, ఖాదర్ బాష, మల్లికార్జున పాల్గొన్నారు.

'రెవెన్యూ అధికారులకు సహకరించాలి'

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని చిన్న హోతూరు గ్రామంలో రీ సర్వే చేయడానికి రైతులు సహకరించాలని తహ శీల్దార్ రామేశ్వర్ రెడ్డి కోరారు. శుక్రవారం గ్రామంలో రీ సర్వేపై ర్యాలీ నిర్వహించి, సర్వే భూమిపూజ చేశారు. అనంతరం సచివాలయం కార్యాలయంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూమి ఉన్న ప్రతి రైతూ భూమిని సర్వే చేసి వారి సరిహద్దులను చూపిస్తారని తెలిపారు. రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ భీమేష్, విఆర్ఒ పులి శేఖర్, సర్పంచి హరికృష్ణ, మాజీ సర్పంచి వరద రాజులు, గ్రామ పెద్దలు మధు, నెట్టప్ప పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

- ఆస్పరిలో ఒకరు, చిప్పగిరిలో ఒకరు

ప్రజాశక్తి - ఆస్పరి/చిప్పగిరి

రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. ఆస్పరి మండలం బిణిగేరిలో బ్యాంకు మేనేజర్ మృతి చెందారు. చిప్పగిరి మండలంలో ఒకరు మృతి చెందారు.

ఆస్పరి మండలం బిణిగేరి గ్రామ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదోని లక్ష్మీ విలాస్ బ్యాంకు మేనేజర్ కోడూరు శశిధర్ రెడ్డి (35) శుక్రవారం మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు... తాడిపత్రి పట్టణానికి చెందిన శశిధర్ రెడ్డి ఆదోనిలో లక్ష్మీ విలాస్ బ్యాంకు మేనేజర్గా పని చేస్తున్నారు. దసరా పండగ సందర్భంగా తన సొంత స్వగ్రామమైన తాడిపత్రికి వెళ్లి పండగ ముగించుకొని తిరిగి ఆదోనికి బామ్మర్ది విష్ణువర్ధన్తో కలిసి మోటార్ బైక్పై బయల్దేరారు. ఆస్పరి మండలం బిణిగేరి గ్రామ సమీపంలో బోయ ఎర్రిస్వామి పొలం దగ్గర ఎదురుగా వస్తున్న (ఎపి 39 ఏఎం 8275 నెంబర్) ఐషర్ బైక్ను ఢీకొనడంతో శశిధర్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. విష్ణువర్ధన్ రెడ్డికి గాయాలయ్యాయి. మృతదేహాన్ని ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. మృతునికి భార్య గౌతమి, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ గంగాధర్ తెలిపారు. అలాగే చిప్పగిరి మండలం గుంతకల్, చిప్పగిరి రహదారి మధ్యలో గురువారం ఆటో బోల్తా పడి ఒక వ్యక్తి మృతి చెందారు. ఎస్ఐ ఎపి.శ్రీనివాసులు వివరాల మేరకు... ఆదోని మండలం ఆరెకల్ గ్రామానికి చెందిన గోవింద రెడ్డి గారి మహేష్ (33) దసరా పండగ రోజున కుటుంబంతో కలిసి గుంతకల్ మండలంలోని కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా చిప్పగిరి సమీపంలో రోడ్డు మధ్యలో ఉన్న గుంతను తప్పించబోగా ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న గోవింద రెడ్డి గారి మహేష్కు గాయాలయ్యాయి. అదే ఆటోలో గుంతకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించాలని వైద్యులు సూచించారు. మార్గమధ్యంలో మహేష్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని భార్య నాగేంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎపి 39 టి 4432 నెంబర్ గల ఆటోను సీజ్ చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.